క్లుప్తంగా

కాళికాంబకు అష్టాదళ పాదపద్మారాధన



అమ్మవారికి పూజలు నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి, వివిధ రకాల పూలతో పూలంగి సేవ కార్యక్రమం జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేపట్టి మహా మంగళ హారతులు ఇచ్చారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



రెడ్డిపల్లెలో నిర్మించిన అభయ ఆంజనేయ, చౌడేశ్వరి ఆలయాలు



హోమంలో పాల్గొన్న భక్తాదులు

రుద్రవరం: మండలంలోని రెడ్డిపల్లెలో అభయ ఆంజనేయ స్వామి,చౌడేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు పుల్లయ్య ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేపట్టి, అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వేద మంత్రోచ్ఛారణలతో హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు.

పశువైద్య భవనం ఏర్పాటు చేయండి



శిథిలావస్థకు చేరిన పశువైద్య భవనం

నంద్యాల(అర్బన్) : పశుసంపదకు నిలయమైన నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో నూతన పశువైద్య భవనాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పాడుబడిన భవనంలో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో వైద్యసేవలకు అక్కడికి వెళ్లాలంటే పశుపోషకులు భయాందోళన చెందుతున్నారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో సిబ్బంది అభద్రతాభావంతో విధులు నిర్వహిస్తున్నారు. ఇక అక్కడ పశువుల వైద్యానికి కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలతో కూడిన నూతన భవనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


ప్రహరీ నిర్మించరూ!



ప్రహరీ లేని పాఠశాల

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 60 మంది విద్యార్థులు విద్యను అభ్యసించే పాఠశాలలో నాడు–నేడు కింద అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు, బాత్ రూంలు అపరిశుభ్రతకు గురవుతున్నాయని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో కొంతమంది మందుబాబులు పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నేలకు జీవం..పైరుకు బలం

- జీలుగ, జనుము, పిల్లిపెసర సాగుతో భూసారం పెంపు
- తగ్గనున్న రసాయనిక ఎరువుల వినియోగం
- దిగుబడి పెరిగే అవకాశం
- ఆర్బీకేల ద్వారా పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ
- రాయితీపై విత్తనాలతో ప్రభుత్వ ప్రోత్సాహం



జిల్లెల్లలో సబ్సిడీ జీలుగలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది



ఎం.చింతకుంట వద్ద సాగు చేసిన జీలుగ పైరు

గోస్పాడు: రసాయనిక ఎరువులతో నేల నిస్సారమవడమే కాకుండా.. దిగుబడులు ఏటేటా తగ్గిపోతున్నాయి. దీంతో పెట్టుబడులు పెరిగి రైతన్న నష్టాలు చవిచూస్తున్నాడు. ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా, నేల సహజత్వాన్ని పెంపొందే చర్యలకు అన్నదాతలు దూరవమడమే ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయనిక ఎరువులు ఇష్టారీతిన వాడటంతో నేల స్థితిగతులనే మారుస్తోంది. పొలాల్లో చౌడు శాతాన్ని పెంచడంతో పాటు సహజ లక్షణాలను దెబ్బతీస్తోంది. వీటి వాడకాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే ప్రభుత్వం భూసారాన్ని పరిరక్షించడంపై దష్టి సారించింది. రైతులకు పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ సబ్సిడీపై విత్తనాలు అందజేసి ప్రోత్సహిస్తోంది. పచ్చిరొట్ట సాగు చేయడంతో చేలల్లో భూసారం పెంపుతోపాటు, పంటల అధిక దిగుబడులు సాధించవచ్చు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టను సాగుచేయడం మేలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇష్టానుసారంగా రసా యన ఎరువులు వాడటం వల్ల నేల సారం దెబ్బతిన డంతోపాటు పంటలు కలుషితమవుతాయి. దీంతో భూసార పరిరక్షణపై రైతుల్లో చైతన్యం పెరిగి భూసారాన్ని పెంపొందించుకునేందుకు సమయం అవుతున్నారు..

పచ్చిరొట్ట పెంపకంతో ప్రయోజనాలు..

- నేలను సత్తువ చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది. నిసార్సమైన భూముల్లో మళ్లీ సారవంతంగా మార్చుకోవచ్చు.
- పచ్చిరొట్ట ఎరువుల వల్ల నేల సారవంతంతో పాటు రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది.
- పచ్చిరొట్ట వేయడం వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. దిగుబడులు పెరుగుతాయి.
- నేలలో సూక్ష్మ జీవులు పెరిగి జీవ రసాయనిక చర్యలు కూడా జరగుతాయి. దీంతో నేలసారంతోపాటు ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది. నేలలోని చాలా రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయి.
- ఎరువులు వేసినపుడు నేలలోని సూక్ష్మ జీవులు పెంచుతాయి.
- పప్పు జాతి పంటలతో రైజోబియం బ్యాక్టీరియా పెరిగి నత్రజని అందుతుంది. ఈ మేరకు ఎరువులు తగ్గించు కోవచ్చు.
- కలుపు మెక్కలు పెరగకుండా కాపాడతాయి.
- భూమి లోతుల్లో ఉన్న పోషకాలను ఉపరితలానికి తీసుకొచ్చి పంట మొక్కలు వాటిని వినియోగించుకునేలా మారుస్తాయి.
- పశువుల మేతగా కూడా ఉపయోగపడతాయి.

పచ్చిరొట్టలో రకాలు..

- పచ్చి రొట్టగా 'ఏ తరహా మొక్కలను పెంచాలన్నది పంటలు పండిస్తున్న నేలపై ఆధారపడి ఉంటుంది. మొత్తంగా ఇలా పండించడానికి అనువుగా పలు రకాల మొక్కలు అందుబాటులో ఉంటాయి.
- జీలుగ, అవిసె, జనుము, వెంపలి, అలసంద, పిల్లి పెసర, పెసర, మినుములు, గోడు చిక్కుడు, అజోల్లా, కానుగ, వేప, గ్లైరిసిడియా, జిల్లేడు, నేతల తంగేడు, కొండ మిరప మొక్కలను విత్తుకోవచ్చు.
- వీటిలో జీలుగ పంటను ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాన్ని ఇసుకతో కలిపి పొలం అంతా చల్లుకోవాలి. పూత దశకు వచ్చాక కలియదున్నితే ఎకరానికి 9 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.
- జనుమును అన్ని నేలల్లోనూ పెంచుకోవచ్చు. దీన్ని పశువులకు మేతగా కూడా వాడవచ్చు.
- పిల్లిపెసరను చౌడు భూముల్లో తప్ప వేరే నేలల్లో పెంచవచ్చు. ఇవి 10 కేజీల విత్తనాలు వేస్తే 5 నుంచి ఆరు టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. పెసర, మినుము పంటలు వేయడంవల్ల పశుగ్రాసంతో పాటు భారీగా పచ్చిరొట్ట కూడా లభిస్తుంది. పెసర, మినుము పంటలను వేయడం వల్ల పశువులకు గ్రాసంతో పాటు పచ్చిరొట్ట కూడా లభిస్తుంది.
- జనుము, జీలుగ పిల్లిపెసర, మినుము, పెసర వంటి మొక్కలన్నింటినీ విత్తనాలను చేలల్లో దుక్కి దున్ని వెదజల్లాలి. పూత దశకు చేరుకున్న తర్వాత పొలంలో వీటిని కలియదున్ని ఈ ఆకులు నేలలో మురిగిన తరువాత వంటలు వేసుకోవాలి. దీనివల్ల మొక్కలు వేగంగా పెరుగుతాయి. వేప, తంగేడు, కానుగ వంటి మొక్కలైతే వాటి కొమ్మలు, ఆకులు సేకరించి పొలంలో పూర్తిగా చల్లుకొని కలియదున్ని మురగనివ్వాలి. ఇవి మురిగిన తరువాత ప్రధాన పంట వేసుకోవాలి. వీటిని వేసవి నెలల్లోనే అంటే ప్రధాన పంట వేయడానికి రెండు నెలలు మందుగానే పెంచుకోవాలి. మురగడానికి సమయం పడుతుంది కాబట్టి ప్రధాన పంట వేయడానికి ముందు కలియదున్ని15 రోజులు పాటు మురగబెట్టాలి. భూమిలో నవనాలు పైకి చేరి నేల సారవంతం అవుతుంది. పూత దశలో ఉన్నపుడే కలియదున్నితే ఎక్కువ పోషకాలు నేలలోకి చేరతాయి..

ప్రభుత్వ ప్రోత్సాహం....

రైతులు నేలను సారవంతం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలైనా పిల్లి పెసర, జీలుగ, జనుము విత్తనాలను అవసరాలను బట్టి రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తోంది. జీలుగులు 10 కిలోలు మార్కెట్ ధర రూ. 880 కాగా రాయితీపై రూ.440 కే అందిస్తోంది. పిల్లి పెసర 10 కిలోలు రూ.1,340 ఉండగా రూ.670కే ఇస్తుంది..

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

పచ్చిరొట్ట పెంచడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమిలో పోషక విలువలు పెరిగి పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు పచ్చిరొట్ట పైర్లు పెంచడానికి అలవాటు పడాలి. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి. పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై రైతుల్లో చైతన్యం వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీ విత్తనాలను రైతులు తీసుకొని భూసారం పెంచుకునేందుకు కృషి చేయాలి.

–స్వప్నికారెడ్డి,
వ్యవసాయాధికారిణి, గోస్పాడు

శిరివెళ్ల మండలంలో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ

శిరివెళ్ల: ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో శిరివెళ్ల మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డికి స్వల్ప మెజార్టీ లభించింది. మెజార్టీ వచ్చిన గ్రామ పంచాయతీలు ఇలా.. మండల కేంద్రం శిరివెళ్లలో 1246, కామినేనిపల్లెలో 436, జీనేపల్లె 241, వీరారెడ్డిపల్లె 170, కోటపాడు 155, గంగవరం 189, వనికినిదిన్నె 20, వెంకటాపురం 301 ఓట్ల మెజార్టీ రాగా మిగిలిన గ్రామాలలో టీడీపీకి మెజార్టీ వచ్చింది. కాగా మండలంలో 16 గ్రామ పంచాయతీలు, 8 గ్రామాలున్నాయి.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గ్రామాలలో ఎక్కడైనా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు ఉంటాయని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలలైన కొత్తపల్లి, శివపురం గ్రామాలలో పోలీస్ పికెట్, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. వీటితో పాటు దుద్యాల, కొక్కెరంచ, నందికుంట, గోకవరం గ్రామాలలో బందోబస్తు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గెలిచిన పార్టీల నాయకులు గాని, కార్యకర్తలుగానీ సంబరాలు చేసుకునేందుకు, విజయోత్సవర్యాలీలు చేసేందుకు అనుమతులు లేవని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గ్రామాల్లో పోలీస్ పికెట్

పగిద్యాల: మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మకమైన నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిద్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట గ్రామాల్లో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముచ్చుమర్రి ఎస్ఐ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం కౌటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా బందోబస్తు చేపట్టారు. ఎక్కడా కూడా అల్లర్లు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో మంగళవారం 144 సెక్షన్ అమలు చేశారు. పోలీసులు అన్ని గ్రామాల్లో పికెట్ నిర్వహించారు. ప్రజలు కూడా రోడ్లపై ఎక్కడా కనిపించలేదు. అందరూ కూడా ఓట్ల లెక్కింపు ఫలితాలను చూస్తూ టీవీలకు అతుక్కుపోయారు. దుకాణాలు కూడా స్వచ్ఛందంగా మూసి వేశారు.

ఇష్టారాజ్యంగా మంచి నీళ్ల వ్యాపారం



పట్టణంలో అనుమతుల్లేకుండా వెలిసిన మంచినీళ్ల వాటర్ ప్లాంట్లు

నందికొట్కూరు: పట్టణంలో కొందరు అనుమతుల్లేకుండా మంచినీళ్ల వ్యాపారం చేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో దాదాపు 70 వేల జనాభా, దాదాపు 14 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాగా, ప్రజలు మినరల్ వాటర్‌పైనే ఆసక్తి చూపుతుండటంతో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అనుమతులు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలు జరుపుతున్నారు. పట్టణ వాసులు ఒక్కో బిందె రూ.10లు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతలేని మినరల్ వాటర్‌ను దుకాణాల్లో ఒక లీటర్ లూజ్ బాటిల్ వాటర్ రూ.4లకు విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డబ్బులిచ్చి తాగునీరు కొనుగోలు చేసి అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు తనిఖీలు చేసి ప్రజలకు శుద్ధమైన నీటిని అందించేలా చూడాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డిని వివరణ అడగగా వాటర్ ప్లాంట్ల యజమానులకు నోటీసులిచ్చాం. అనుమతులేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామని, బిందెనీరు రూ.10లకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ



ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిపై 12,037 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. బుధవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఆమె దాదాపు ప్రతి రౌండ్‌లో అధిక్యం కనబరిచారు. గత నెల 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో నియోజవర్గంలో మొత్తం 1,95,582 ఓట్లు పోల్ కాగా అందులో భూమా అఖిలప్రియకు 98,881 ఓట్లు రాగా, గంగుల బిజేంద్రారెడ్డికి 86,844 ఓట్లు లభించాయి. నోటాకు 1,582, ఇతరులకు 8275 ఓట్లు పోలయ్యాయి. గెలుపొందిన అఖిలప్రియకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి డిక్లరేషన్ పత్రం అందజేశారు. 2014లో ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలుపొందిన భూమా శోభానాగిరెడ్డి మృతి చెందడంతో అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికలో అఖిలప్రియ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనతరం జరిగిన పరిణామాల్లో టీడీపీలో చేరి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గంగుల బిజేంద్రారెడ్డి చేతిలో సుమారు 36 వేల ఓట్ల తేడా ఓడిపోయారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో వారిద్దరే తలపడగా అఖిలప్రియ గెలుపొందారు.

మానవత్వం చాటుకున్న ఏఎన్‌ఎంలు

మహానంది: నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ సాయిబాబా గుడి వీధిలో నివాసముంటున్న వాల్మీకి గుత్తికావలి జ్యోతికి ఇటీవల ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆమె చికిత్సకు సహాయ, సహకారాలు అందించాలని సోషల్ మీడియాలో వచ్చిన సందేశానికి బండిఆత్మకూరు మండలం నారాయణాపురం ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్పందించారు. ఏఎన్‌ఎంలు వీరమ్మ, బాలహుసేనమ్మ, పద్మావతి మంగళవారం తమ వంతుగా రూ. 6వేలు సహాయం అందించారు.

ప్రమాదకరంగా గుర్రపు డెక్క



క్రిష్టిపాడులో బ్రిడ్జికి అడ్డుకున్న గుర్రపుడెక్క

దొర్నిపాడు: భారీ వర్షాల కారణంగా కుందూకు ఉధృతంగా వర్షపు నీరు చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపు డెక్క భారీగా కొట్టుకొస్తోంది. గుర్రపు డెక్క క్రిష్టిపాడు వద్దనున్న వంతెన వద్ద నిలిచి ప్రవాహానికి అడ్డంగా మారింది. ప్రస్తుతం నదిలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుర్రపు డెక్కను తొలగించకపోతే బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు.

విత్తుకు సిద్ధమవుతున్న రైతులు



నందికొట్కూరులో మొక్కజొన్న విత్తనాల కోసం దుకాణం వద్ద రైతులు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షం కురవటంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. 15,250 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, భాస్కరాపురం గ్రామాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగుచేస్తారు. బోర్లు, బావులున్న పొలాలతో పాటు కేసీ కాల్వ ఆయకట్టు రైతులు కూడా అధికంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తారు. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు విత్తుకు అనుకూలంగా మారడంతో రైతులు మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసేందుకు నందికొట్కూరు పట్టణంలోని విత్తనాల దుకాణాల వద్దకు చేరుకుంటున్నారు. ఇదే అవకాశంగా భావించిన విత్తనాల దుకాణాల దారులు విత్తనాల ప్యాకెట్ ధరలను అమాంతం పెంచేసి అధికధరలకు విత్తనాల ప్యాకెట్లను అంటగట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకొని ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన మొక్కజొన్నల విత్తనాలను రాయితీపై అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నంద్యాల ఎమ్మెల్యేగా ఫరూక్ విజయం



పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న అధికారులు



ఈవీఎంల కౌంటింగ్ దృశ్యం



ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నంద్యాల అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఫరూక్ విజయం సాధించారు. మే 13న జరిగిన ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు మరో 26మంది పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిపై 12,333 ఓట్ల మెజార్టీతో ఫరూక్ గెలుపొందారు. నంద్యాల నియోజకవర్గంలో 2,73,938 ఓట్లు ఉండగా 2,04,495 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4,300 ఉండగా 4,083 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి 90,742 ఓట్లు రాగా ఫరూక్‌కు 1,03,075 ఓట్లు వచ్చి 12,333 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి గోకుల్ కృష్ణారెడ్డికి 6,346 ఓట్లు, ఇతర అభ్యర్థులు వెంకటరమణకు 1,104 ఓట్లు, అబ్దుల్ షేక్‌కు 289, సుబ్బరాయుడుకు 85, ఆదినారాయణరెడ్డికి 92, వెంకటేశ్వర్లు 75, సుధాకర్‌రావు 52, చెన్నయ్య 75, బాబాఫకృద్దీన్ 72, సుబ్బరాయుడు 80, రమేష్ 367, రాఘవేంద్ర 79, అబ్బాస్ 122, షేక్ మహమ్మద్ ఫాజిల్ 24,03, విష్ణువర్ధన్‌రెడ్డి 100, చిన్నరాజు 282, లింగమయ్య 202, నాగేషు 146, చంద్రశేఖర్ 134, రవికుమార్ 110, హయగ్రీవాచారి 510, కేశవ 61, విక్రమ్ బాబు 144, విజయ్‌కుమార్ 47, శ్రావణ్‌కుమార్ 46, షేక్ రియాజ్‌కు 81 ఓట్లు పోలయ్యాయి.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో..

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీ అభ్యర్థి ఫరూక్‌కు 2,469 ఓట్లు పోల్ కాగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి 1,425 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీ అభ్యర్థికి 1,044 ఓట్లు మెజార్టీ లభించింది. అలాగే నోటాకు 1,533 మంది ఓటు వేశారు. ఇదిలా ఉండగా ఉద్యోగులు సైతం 50 మంది నోటాకు ఓటు వేశారు.

ఆధ్యాత్మిక ఆనందం!



ఆలయ పరిసరాల్లో అడుగుపెట్టగానే దర్శనమిచ్చే నంది

దట్టమైన నల్లమలలో వెలిసిన మహానంది ఆలయ పరిసర అందాలు భక్తులకు మహానందం కలిగిస్తున్నాయి. పచ్చటి చెట్లు, ప్రకృతి అందాలు, పక్షుల కిలకిల రావాలు, కోనేటి జలసవ్వడులు భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఆలయానికి వచ్చిన వెంటనే రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన కృష్ణశిలతో చేసిన నంది బసవన్న, ఆలయానికి ఇరు వైపులా ఏర్పాటు చేసిన వివిధ రకాల వాయిద్యాలను చేతబూని మనసును ఉత్తేజపరిచే విచిత్ర గణపతులు, వివిధ రకాల ఆయుధాలను ధరించిన నవదుర్గలు భక్తులను ఆధ్యాత్మికానందానికి గురిచేస్తున్నాయి. ఆలయ రాజగోపురం దాటిన వెంటనే అటూ, ఇటూ రెండు కోనేరులు, పచ్చటి చెట్లు, పార్వతీ పరమేశ్వరులు. ఈ దృశ్యాలను చూసిన భక్తులు మంత్రముగ్ధులవ్వక తప్పదు. – మహానంది





ఆలయ మహాద్వారం దాటగానే కుడివైపున ఉన్న నవ వినాయకులు,ఎడమవైపున ఉన్న నవదుర్గలు



నీలకంఠుడికి నీలాకాశం నీడ